క్లుప్తంగా

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



చుంచు ఎర్రగుడిలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రైతులు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో గతేడాది పంటలు నష్టపోయిన రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 1730 మందికి రూ.67,77,907 పరిహారం మంజూరైంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, దివంగత నేత వైఎస్సార్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గ్రామనడిబొడ్డున కార్యక్రమం నిర్వహించగా వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంత రెడ్డి రైతులతో కలిసి సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి స్వీట్లు తినిపించుకున్నారు.

బియ్యం వేలం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథ దేవాలయంలో భక్తులు సమర్పించిన బియ్యం 18.50 క్వింటాళ్లను వేలం వేయగా రూ.40 వేలు ఆదాయం సమకూరినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఆలయ అభివృద్ధిగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోలర్ ఈఈ హెచ్‌డి.ఈరన్న

ఆలూరు: బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని పీఆర్ క్వాలిటీ కంట్రోలర్ ఈఈ హెచ్‌డి.ఈరన్న ఇంజనీర్లకు సూచించారు. అనంతరంపురం జిల్లా గుత్తి నియోజకవర్గంలోని గుంతకల్లు మండలం పెంచికలపాడు గ్రామం నుంచి గుమ్మనూరు గ్రామం వరకు జరుగుతన్న రూ.5 కోట్ల రీకన్‌స్ట్రక్షన్ బీటీ రోడ్డు పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ ఈరన్న మాట్లాడుతూ.. టెండర్‌లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. నాణ్యత లోపిస్తే టెండర్ రద్దు చేసి ఆర్‌ఆర్ యాక్టు ద్వారా నిధులు రికవరీ చేస్తామన్నారు. పీఆర్ డీఈ శ్రీరాములు, జేఈ చౌడారెడ్డి తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలతో డెంగీ నివారణ

తుగ్గలి: ముందస్తు జాగ్రత్తలతో డెంగీ, ఇతర దోమకాటు వ్యాధులు నివారించవచ్చని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంగీ వ్యాధి ప్రాణాంతకమైందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమకాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందాలి

మద్దికెర: పొదుపు సంఘాలలో కల్పించే రుణ సదుపాయం సద్వినియోగం చేసుకుని సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని వైకేపీ ఏపీఎం మధుబాబు సూచించారు. గురువారం పెరవలి గ్రామంలో స్వయం ఉపాధి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. మహిళలు సొంతంగా వ్యాపారాలు చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. టమాటా, ఉల్లి, డ్రయర్ మెషిన్లు ఉపయోగించి వాటిని అరబెట్టి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఇందుకు గ్రామంలో 50 మంది మహిళలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

మేలైన గ్రాసంతో పాల దిగుబడి పెరుగుదల



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్నబాబు

ఎమ్మిగనూరురూరల్: పశువులకు మంచి మేత అందించడం ద్వారా పాల దిగుబడి పెంచవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రసన్నబాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బనవాసి ఫారంలోని శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కాలేజీలో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేడీ డాక్టర్ ప్రసన్నబాబు మాట్లాడుతూ.. పాడి రైతులు, గొర్రెల యజమానులు పశుగ్రాసంపై దృష్టి పెట్టాలని సూచించారు. పశుగ్రాసాన్ని పెంచుకుంటే అధిక లాభాలు చేకూరే అవకాశం ఉందన్నారు. పశువులకు పచ్చిమేత వేయడం ద్వారా పాలదిగుబడి పెరిగి ఆర్థికంగా స్థిరపడవచ్చని చెప్పారు. ఆదోని డీడీ రమణ, ఎమ్మిగనూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యాచారి, ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు వేళలు మార్చాలి

చిప్పగిరి: డేగులహాలు గ్రామానికి గుంతకల్లు నుంచి నడుపుతున్న బస్సు సర్వీసు వేళలు మార్పు చేయాలని గుంతకల్లు ఆర్టీసీ డీఎం సూర్యనారాయణను వినతి పత్రం ద్వారా కోరినట్లు సర్పంచ్ నీలకంఠ గురువారం తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4 గంటలకు గుంతకల్లు నుంచి బస్సు నడపాలని కోరారు.

ప్రజా సంక్షేమమే 'సురక్ష' ధ్యేయం





సూదేపల్లెలో దివ్యాంగుడు సుధాకర్‌కు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

పత్తికొండటౌన్: సంక్షేమ పథకాలకు అర్హులైన వంద శాతం మందికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టంచేశారు. ఆమె గురువారం పత్తికొండ పట్టణంలోని గ్రామ సచివాలయాలు-5, 6ల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఎంపీడీఓ కవిత, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలు ప్రతి ఇంటికి సంపూర్ణంగా అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె సూదేపల్లెలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్, డీటీ ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 354 మంది దరఖాస్తుదారులకు పలురకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం ఎర్రకోట గ్రామంలో సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే గంటల వ్యవధిలోనే ఉచితంగా సర్టిఫికెట్లు అందుతాయన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. మండలాధ్యక్షుడు గొల్ల కేశన్న, సర్పంచ్ పెద్ద మారెప్ప, మండల ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని లక్ష్మీపేట 26వ సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు విశ్వనాథ్‌రమేష్, కోటకొండ నరసింహులు తదితరులు దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు.

ఆస్పరి: మండలంలోని జొహరాపురంలో సర్పంచ్ నెల్లూరప్ప, డీకోటకొండలో సర్పంచ్ జయలక్ష్మి అధ్యక్షతన తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జొహరాపురంలో 254, డీకోటకొండలో 223 సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు పంపిణీ చేశారు.

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు, జొన్నగిరి గ్రామాల్లో గురువారం తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ లీలావతి, వైస్ ఎంపీపీ నాగప్ప, తదితరులు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

గోనెగండ్ల: మండలంలోని హెచ్.కైరవాడి-2, పెద్దనేలటూర్-1 గ్రామ సచివాలయాల పరిధిలో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు.

నందవరం: మండల పరిధిలోని పెద్దకొత్తిలి, పూలచింత గ్రామాల్లో మండల అధికారులు ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పెద్దకొత్తిలి గ్రామ సచివాలయంలో-210 మందికి, పూలచింత గ్రామ సచివాలయంలో- 350 మందికి సర్టిఫికెట్లను అధికారులు పంపిణీ చేశారు.

మద్దికెర: మండలపరిధిలోని పెరవలి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు ఆయా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామంలో ఎంపీడీఓ అల్లబకాష్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగరాజు, సచివాలయాల కన్వీనర్ ఈరన్న తదితరులు దరఖాస్తుదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

హాలహర్వి: మండలంలోని బిలేహాల్, బేవినహాల్ గ్రామాల్లో తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంతోనీ ఆధ్యరంలో ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలను మంజూరు చేశారు.

దేవనకొండ: మండలంలోని పల్లెదొడ్డి, గుండ్లకొండ గ్రామాల్లో సర్పంచ్ ఉద్య రంగస్వామి ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు.మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గౌరీదేవి పాల్గొన్ని ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు.

చిప్పగిరి: మండలంలోని డేగులహాలు గ్రామంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 306 మందికిగాను 294 మందికి సర్టిఫికెట్లు అందించారు.

మాన్యం భూమి సాగుకు సీసీఆర్‌సీ



మా తాతల కాలం నుంచి గ్రామ శివాలయంలో పూజారులుగా ఉంటున్నాం. ఆలయ మాన్యం భూమి 12 ఎకరాలను నలుగురం అన్నదమ్ములం సాగు చేసుకుంటున్నాం. పౌరోహిత్యంతో పాటు రైతులుగా జీవిస్తున్న తమకు ఎన్ని ప్రభుత్వాలు వచ్చి పోయినా పథకాలు అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేవుని మాన్యాలకు సైతం సీసీఆర్‌సీ (కౌలు కార్డు) ఇవ్వాలన్న ఆదేశాల మేరకు వలంటీర్ హరీష్ మా నలుగురు అన్నదమ్ములచేత సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేయించాడు. ఈరోజు మాకు ఉచితంగా కౌలు కార్డు అందింది. ఇకపై యాజమాన్య రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయనే భరోసా కలిగింది.

– శివ, శివాలయం పూజారి, సూదేపల్లె

ఏనాడూ భారంగా భావించలేదు



వృద్ధురాలు సారంబీకి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ బగిలి రఫీ

గోనెగండ్లకు చెందిన వృద్ధురాలు ఐదు నెలల క్రితం కింద పడడంతో కాలు విరిగి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ బగిలి రఫీ కర్నూలుకు వెళ్లి రూ.2,750 పింఛన్ అందజేశాడు. తరువాత వృద్ధురాలు ఎమ్మిగనూరులోని మనుమరాలు వద్ద ఉంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వృద్ధురాలి దీనస్థితిని తెలుసుకున్న వలంటీర్ బగిలి రఫీ ఐదు నెలలుగా ఎమ్మిగనూరు (15 కి.మీ)కు వెళ్లి ఆమెకు పింఛన్ అందజేస్తున్నాడు. పింఛన్ సొమ్ము తన మందులకు ఇతర అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందని వృద్ధురాలు పేర్కొంది. –గోనెగండ్ల

వలంటీర్ సేవలు భేష్



నాకు కాలు విరగడంతో రాడ్ వేశారు. ప్రస్తుతం ఎమ్మిగనూరులోని మైనార్టీ కాలనీలో మనుమరాలి దగ్గర ఉంటున్నాను. ప్రతి నెలా పింఛన్ వస్తున్నా తీసుకునేందుకు వెళ్లలేని పరిస్థితి. నా పరిస్థితి తెలుసుకుని వలంటీర్ బగిలి రఫీ ఇక్కడికే వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. భారంగా భావించకుండా ఇక్కడికే వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తుండడం సంతోషంగా ఉంది. ఎలాంటి ఆదాయం లేని నాకు పింఛన్ సొమ్ము ఆదారంగా ఉపయోగపడుతోంది. – సారంబీ, వృద్ధురాలు, గోనెగండ్ల

ప్రాణాలొడ్డి సేవలందించారు



కరోనా సమయంలో వృద్ధురాలికి సరుకులు, ఆకుకూరలు అందజేస్తున్న వలంటీర్లు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలు పుల్లమ్మ. మామిల్లకుంట గ్రామస్తురాలు. భర్త చనిపోవడంతో కూతురు, కుమారుడుతో కలిసి ఉంటోంది. కరోనా విపత్కర సమయంలో ప్రజలెవరూ ఊరు విడిచి వెళ్లలేని పరిస్థితి. అలాంటి సమయంలో వృద్ధురాలి కుటుంబానికి వలంటీర్లు భీమేష్, వాసు, రవి అండగా నిలిచారు. ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సేవలందించారు. గ్రామంలో పాజిటివ్ నమోదైన కేసుల వివరాలు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందికి తెలియజేశారు. వారు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రామస్తులకు అవసరమైన సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు.

మాలాంటి వారికి అండగా ఉన్నారు



వయసు మీద పడింది. రెండేళ్ల క్రితం కరోనా సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాంటే భయంగా ఉండేది. అప్పుడు వలంటీర్లే మా ఇంటికి వచ్చి సరుకులు, కూరగాయలు, పింఛన్లు అందజేశారు. మాలాంటోళ్లకు వాళ్లు బాగా సాయపడ్డారు. ప్రాణాలకు తెగించి ఇళ్లకు వచ్చి వలంటీర్లు సేవ చేయడం ఎప్పటికీ మరువలేం. – పుల్లమ్మ, మామిల్లకుంట

ఆసుపత్రికి వచ్చి పింఛన్ ఇచ్చారు



కర్నూలులో చికిత్స పొందుతున్న అంపమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నరేష్ (ఫైల్)

ఈ ఫోటోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ పేరు అంపమ్మ. ఎమ్మిగనూరు పట్టణంలోని 12వ వార్డులో ఉంటున్న ఆమెకు గొంతు కింద వాపుతో గడ్డ రావడంతో కర్నూలులోని గౌరిగోపాల్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొంది. ఈమె ప్రతినెలా వృద్ధాప్య పింఛన్ పొందేది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో పింఛన్ కోసం వచ్చేందుకు వీలుగాకపోవడంతో 12వ వార్డు వలంటీర్ సి.నరేష్ రెండు నెలల పాటు కర్నూలులోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు.

–ఎమ్మిగనూరుటౌన్

ఎంతగానో ఉపయోగపడింది



కర్నూలులో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వలంటీర్ నరేష్ అక్కడికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేశారు. ఎక్కడున్నా వచ్చి పింఛన్ అందిస్తారని అప్పటివరకు అనుకోలేదు. వలంటీర్ వ్యవస్థతోనే అది సాధ్యమైంది. పింఛన్ సొమ్ము నాకు ఎంతో ఉపయోగపడింది. లేకపోతే చాలా ఇబ్బందులు పడేదాన్ని. చికిత్స అనంతరం పూర్తిగా కోలుకుని హోటల్‌లో పనిచేసుకుంటున్నా. అలాగే పింఛన్ సొమ్ము ఎంతో ఆసరాగా ఉంటోంది.

– అంపమ్మ, 12వ వార్డు, ఎమ్మిగనూరు

రైతు సంక్షేమానికి కృషి



రైతు కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ మేరకు రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. నందవరం మండల పరిధిలో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబ సభ్యులైన బోయ బజారమ్మ, మీనుగ నగమ్మలకు ఒక్కొక్కరికి రూ.7లక్షల ప్రకారం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే గురువారం తన నివాసంలో వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో వారి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయాయన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మికాంతరెడ్డి, శివప్పగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతాం



పత్తికొండ ముస్లిం వీధిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, అభివృద్ధి చేసి చూపిస్తాం అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. పత్తికొండ గ్రామ సచివాలయం-1, 2 పరిధిలోని ముస్లింవీధిలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను గురువారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20లక్షలతో పాటు, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలుతో ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. గురువారం సీసీ రోడ్లు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల ఆదరణ, అభిమానాలే తమ ను ముందుకు నడిపిస్తున్నాయన్నారు. ఎంపీపీ ఎం.నారాయణదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక, సోమశేఖర్, నీలకంఠ, వడ్డె రంగమ్మ, బలరాముడు, టీఎండీ హుసేన్, శ్రీరంగడు, పల్లెప్రతాప్‌రెడ్డి, కారం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో నవరత్నాల వెలుగులు



22వ వార్డులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపలో నవరత్నాల వెలుగులు విరజిల్లుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ డిష్ కేశవరెడ్డిలతో కలిసి ఎమ్మిగనూరు 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తగిన ప్రణాళికతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డీఈ మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, షబ్బీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వృద్ధుడి దుర్మరణం



మృతిచెందిన వెంకటరాముడు

కర్నూలు: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన దాసరి వెంకటరాముడు (89) దుర్మరణం చెందాడు. ఈయనకు భార్య రంగమ్మతో పాటు ఇద్దరు కొడుకులు, కూతుళ్లు ఉన్నారు. కుమారులు కర్నూలులో ఉంటున్నారు. వారి కోసం కర్నూలుకు వచ్చిన వెంకటరాముడు బళ్లారి చౌరస్తా సమీపంలోని యమహా షోరూమ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఎమ్మిగనూరు నుంచి గూడూరు మీదుగా కర్నూలుకు వస్తున్న కర్నూలు-1 డిపో బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలపై దాడి

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో పొలం తగాదాలో ఇద్దరు మహిళలపై ప్రత్యర్థి వర్గం వారు దాడికి తెగబడ్డారు. తుగ్గలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సంజమ్మ, సుంకులమ్మ గురువారం పొలంలో పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మునీశ్వరి, రోజా రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు కర్రలతో దాడి చేశారు. ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

పత్తికొండ రూరల్: స్థానిక ఉప్పర వీధిలో ఉప్పర నరసింహులు (52) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి సేవాదళ్ సంస్థ తరపున అందించిన రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని మాజీ ఉపసర్పంచ్ కోటేశ్వరరావు గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతదేహానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. వార్డు మెంబర్లు లైట్ నాగరాజు, సేవాదళ్ సభ్యులు గోవిందరాజులు ఉన్నారు.


మోస్తరు వర్షం

తుగ్గలి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బుధ, గురువారాల్లో కురిసిన వర్షానికి వేరుశనగ విత్తే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు.ఎట్టకేలకు ఓ మాదిరి పదును కావడంతో ఊరట చెందుతున్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

హాలహర్వి: గొర్రెలు, మేకల సంరక్షణ పట్ల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం హాలహర్విలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో గొర్రెలకు గాలికుంటు, ఇతర వ్యాధులు సంక్రమించకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మందులను పంపిణీ చేశారు. గొర్రెలు, మేకలు, పశువులకు ఏ చిన్న జబ్బు వచ్చినా వెంటనే తమకు సమాచారం అందించాలని వచ్చి చికిత్స అందిస్తామని చెప్పారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, వెటర్నరీ సిబ్బది వీరకుమార్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.


పవన్‌కళ్యాణ్‌కు మతి భ్రమించింది



పత్తికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



వెల్దుర్తిలో ఏఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

పత్తికొండ టౌన్: ప్రజల్లో ఆదరణ లేని ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ మతి భ్రమించి వలంటీర్లపై ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హితవుపలికారు. ఆమె గురువారం పత్తికొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలను ఫణంగా పెట్టి, ఇంటింటికీ తిరిగి ప్రజలకు సేవలు అందించిన గ్రామ వలంటీర్లను కించపరిచేలా మాట్లాడిన సంస్కారహీనుడు పవన్‌కళ్యాణ్ అని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవనే అక్కసుతో చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణ డైరెక్షన్‌లో గ్రామ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వార్డుమెంబర్, సర్పంచ్‌గా కూడా గెలవని పవన్‌కళ్యాణ్‌కు వలంటీర్ల గురించి ఏమి తెలుసని, ప్రజలతో మమేకమై, లబ్ధిదారులతో మాట్లాడితే వలంటీర్ల సేవల గురించి తెలుస్తుందన్నారు. పవన్‌కు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, భాస్కర్‌నాయక్, పల్లె ప్రతాప్‌రెడ్డి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వెల్దుర్తి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై మండల వలంటీర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తమ పిర్యాదును గురువారం ఏఎస్ఐ బాలకృష్ణకు అందించారు. పవన్‌కళ్యాణ్ తన వారాహి యాత్రలో వలంటీర్లపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, దేశ ద్రోహులుగా పోల్చుతూ, దుర్భాషలతో కించపరుస్తున్నాడని పేర్కొన్నారు. ఆయనపై కేసు నమోదు చేయాలని విన్నవించారు. అంతకుముందు స్థానిక సొసైటీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పవన్‌ను సినిమా హీరోగా అభిమానించే తాము ఇలాంటి తలతిక్క వ్యాఖ్యలతో వేదన చెందుతున్నామన్నారు. తమపై చేసిన అపవాదుపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గోనెగండ్ల: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ అనుచిత వ్యాఖ్యలపై గురువారం గోనెగండ్లలో వలంటీర్లు నిరసన చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. పవన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దేవనకొండ: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ దేవనకొండ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి పేద ప్రజలకు అండగా ఉంటూ ప్రతి పథకాన్ని వారి దరికి చేరుస్తోందన్నారు. అలాంటి వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. స్థానిక నాయకులు, వలంటీర్లు ఉన్నారు.